

అపార్టుమెంట్‌వాసులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

'సుమధుర'లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

రాయదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలోని సుమదుర అపార్ట్‌మెంట్స్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యపై మాజీ కార్పొరేటర్ సాయిబాబా, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్‌వాసులు మాట్లాడుతూ రోజూ 18 సార్లు కరెంటు పోతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెకు వివరించారు. ఈ సమస్య పరిష్కారం కోసం అవసరమయితే సబ్‌స్టేషన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఈ చరణ్, ఏఈ వేణుగోపాల్, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్‌ముదిరాజ్, నాయకు లు శ్రీనివాస్‌యాదవ్, మంత్రిప్రగడ సత్యనారాయణ, నరేష్, నారాయణ, గోవింద్, రామిరెడ్డి, సుమధుర అపార్ట్‌మెంట్స్ చైర్మన్ పివి. చౌదరి, రామారావు, దేవిరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రదీప్‌కుమార్, ఎంఎస్‌రావు, రాంనారాయణరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం ఇస్తున్న పద్మానగర్‌వాసులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పేట్‌బషీరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో స్థానిక నాయకులు మంగళవారం కలిశారు. పద్మానగర్ ఫేజ్-2 నుంచి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఈ ప్రాంతం నుంచి లోకల్ బస్సులు వెళ్లేవని, కరోనా తర్వాత బస్సు సర్వీసులు నిలిపివేశారని ఎమ్మెల్యేకు విన్నవించారు. మూడు సంవత్స రాల క్రితం బంద్ చేసిన బస్సులను నడిపించాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు.

అధికారులతో కార్పొరేటర్ సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూకట్‌పల్లిలోని వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, దోమలు, వీధిదీపాలు, వ్యర్థాల తొలగింపు తదితర సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ హెచ్.కృష్ణయ్య, అధికారులు మోహన్‌రెడ్డి, మమత, వెంకటేశ్వరరావు, భద్రన్న, ప్రియాంక, ఉషారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు సదుపాయాలు కల్పిస్తాం


చింతల్ బస్టాప్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీఅధికారులు

జీడిమెట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సరైన సదుపాయాలు కల్పించడానికి ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కూకట్‌పల్లి డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కవిత రూపాల అన్నారు. స్కూల్స్, కాలేజీలు ప్రారంభంకావడంతో మంగళవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చింతల్ బస్టాప్‌లో సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులు, ప్రయాణికులతో డ్రైవర్లు, కండక్టర్ల ప్రవర్తనపై ఆరా తీశారు. ప్రయాణికులు క్రమశిక్షణతో బస్సులు ఎక్కాలన్నారు.

రాజీవ్‌గృహకల్పలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం


ఇళ్లమధ్యలో నిలిచిన మురుగునీరు

జీడిమెట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారింది. డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరంతా ఇళ్లమధ్యలో నిలిచిపోవడంతో గృహకల్పవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్‌గృహకల్పలోని అన్ని బ్లాక్‌లలో ఇదే పరిస్థితి ఉన్నా సర్కిల్ అధికారులు గానీ, వాటర్‌వర్క్స్ అధికారులగానీ ఎలాంటి చర్య లూ తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను అరికట్టాలని గృహకల్పవాసులు కోరుతున్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా గాయత్రీమాత జయంతి వేడుకలు

చందానగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గాయత్రీదేవీ మాత జయంతి వేడుకలు శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీ శివాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపధ్యంలో ఇటీవల జీడిమెట్ల డివిజన్‌లోని కరెంట్ తీగలకు అడ్డుగా ఉండే చెట్టు కొమ్మలను విద్యుత్ శాఖ అధికారులు చేపట్టారు. పడేసిన కొమ్మలను తొలగించడంలో పనులు చేసిన కాంట్రాక్టర్ వాటిని తొల గించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాలనీలో చెట్టు కొమ్మలను తొలగించి, రహదారిపై పడవేయడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగడమే కాకుండా, అపరిశుభ్రత నెలకొన్నదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఫస్ట్ ఎవెన్యూ కాలనీ నుంచి వెళ్లే రహదారిలో తొలగించిన కొమ్మలను వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

జీడిమెట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ ఆటోడ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చింతల్ పద్మానగర్ ఫేజ్-2కు చెందిన ఎరుకల లక్ష్మణ్(26) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రియల్ వ్యాపారి..

నిజాంపేట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో రియల్ వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అద్దె కట్టలేదని ఇంటి యజమాని తల్లి తిట్టడంతోనే తనభర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య బాచుపల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. తూర్పుగోవరి జిల్లా, రాజమండ్రి ప్రాంతంలోని గోకవరానికి చెందిన దాసరి వరప్రసాద్(45), భార్య శైలజ బాచుపల్లి ప్రాంతంలోని శ్రీసాయినగర్, వసంతనగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఈనెల 15వ తేదీన శైలజ పోచారంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఆర్థిక ఇబ్బందులతో 4 నెలల నుంచి ఇంటి అద్దె కట్టలేదని ఇంటి యజమాని తల్లి కఠినంగా మాట్లాడడంతో మనస్తాపానికి గురైన వరప్రసాద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా రోడ్లు


పాపారాయుడునగర్ నుంచి కూకట్‌పల్లి మెట్రో షాపింగ్ మాల్ వరకు వెళ్లే హైటెన్షన్‌లైను రహదారిలో గుంతలు

అవస్థలు పడుతున్న వాహనదారులు


కూకట్‌పల్లిలోని దేవిస్థాన్ విల్లాస్ ముందు రోడ్డులో

కూకట్‌పల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షాలకే కూకట్‌పల్లి ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా మారాయి. రహదారులు, కాలనీ అంతర్గత రోడ్లపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా కూకట్‌పల్లి, వివేకానందనగర్, మూసాపేట, బాలాజీనగర్, కేపీహెచ్‌బీకాలనీ ప్రాంతాల్లో అస్తవ్యస్త రోడ్ల కారణంగా వాహనదారులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలలుగా గుంతలు పడ్డ రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు విఫమవుతున్నారని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.


కూకట్‌పల్లిలోని లోకయ్యపటేల్‌నగర్ వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు


వివేకానందనగర్‌కాలనీ నుంచి చిత్తారమ్మ దేవాలయం వెళ్లే రోడ్డులో..


కూకట్‌పల్లి పాపారాయుడునగర్ ప్రధానరహదారిలో..


కూకట్‌పల్లి డివిజన్ బాలకృష్ణనగర్‌లో..


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జగద్గిరిగుట్టవాసులు

పరికి చెరువును కాపాడండి

దుండిగల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కబ్జా అవుతున్న పరికి చెరువును కాపాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జగద్గిరిగుట్టవాసులు ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. జగద్గిరిగుట్ట ప్రభుత్వ సర్వేనెంబరు 348/1లో గల పరికి చెరువు, మిగతా స్థలాలను బాలకృష్ణ అనే వ్యక్తి పేదలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకున్నాడని మంత్రికి వివరించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకొని, ఆ స్థలాలను కాపాడాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గణేష్, కో-ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రవీందర్, రామకృష్ణ, శ్రీనివాసా చారి, వేణు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై కేసు


అక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గాజులరామారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వేనెంబరు 13లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి గోశాల, రూమ్‌లను నిర్మించిన కబ్జాదారులపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో సూరారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గాజులరామారం గ్రామ సర్వే నెంబరు 13లో ప్రభుత్వ స్థలాన్ని గత కొంతకాలంగా కబ్జా చేస్తున్నారు. అయితే స్థలం సమీపంలో ఉన్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీవాసులు కబ్జాలను అడ్డుకున్నారు. ఆపై రెవెన్యూ అధికారులు ఈ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, ప్రభుత్వ స్థలం అని బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయినా కబ్జాదారులు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. వాటిని సైతం కూల్చేసి రెవెన్యూ అధికారులు సూరారం పోలీస్‌స్టేషన్‌లో కబ్జాదారులపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మేడ్చల్ అదనపు డీసీపీ నర్సింహారెడ్డి, సూరారం సీఐ వెంకటేశం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీడీ పీపీఏ సెక్షన్-447, 427 క్రింద కబ్జాదారులు శ్రీనాధ్, శోభారాణి, సంధ్యారెడ్డి, విజయ, కుమారి, హేమశ్రీలపై కేసులు నమోదు చేశారు.

నిలిచిన అక్రమ నిర్మాణాల కూల్చివేత


కొంత కూల్చి వదిలేసిన అధికారులు

దుండిగల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ డీపోచంపల్లి గ్రామ పరిధిలో సర్వేనెంబరు 186లో అక్రమ నిర్మాణాలను కూల్చడానికి వెళ్లిన అధికారులకు నిర్మాణదారుల నుంచి నిరసన వ్యక్తం కావడంతో వెనుదిరిగారు. ఈనెల 14న 'అనుమతులు లేవు, అయినా ఆగని అక్రమ నిర్మాణాలు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. కథనానికి మూడు రోజులు అనంతరం కమిషనర్ కె.సత్యనారాయణ, టీపీఓ సంజన, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది స్పందించారు. అక్రమ నిర్మాణాలను కూలగొట్టడానికి మంగళవారం వెళ్లారు. ఇది గమనించిన నిర్మాణదారులు తమకు తెలిసిన నాయకులతో కమిషనర్‌కు ఫోన్ చేయించడంతో పాటు తమ నిర్మాణాలు కూల్చొద్దని వేడుకున్నారు. దీంతో అధికారులు వెనుకంజ వేశారు. ఈ సర్వే నెంబరులో అనుమతులు లేని నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉన్నాయి.

కేంద్రమంత్రులకు ఘనస్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు

గచ్చిబౌలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసి ఈనెల 20న రాష్ట్రానికి వస్తున్న కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కి శంషాబాద్ విమానాశ్రయం వద్ద పెద్దఎత్తున స్వాగతం పలికేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మసీద్‌బండలో నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కన్వీనర్ రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పాల్గొని మంత్రుల స్వాగత కార్యక్రమానికి రంగారెడ్డి, శేరిలింగంపల్లి ప్రాంతాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కసిరెడ్డి భాస్కరరెడ్డి, రాజుశెట్టి, దయాకర్, మేరి, రాంరెడ్డి, సీతారామరాజు, రవీందర్‌రెడ్డి, రవీందర్‌రాజు, మేరి, రేణుక పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తా

ఫతేనగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పరిధిలోని న్యూ గౌతమీనగర్‌లో డ్రైనేజీ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ బస్తీవాసులకు హామీ ఇచ్చారు. బాలానగర్ సెక్షన్ జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌తో కలిసి న్యూగౌతమీనగర్‌లో డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాన్ని మంగళవారం పర్యవేక్షించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ మేనేజర్‌కు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


న్యూగౌతమీనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం: కూన

జీడిమెట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరంలా మారిందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు.కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-1కు చెందిన కొట్టి రమణకు అత్యవసర చికిత్స అవసరం కావడంతో కూన శ్రీశైలంగౌడ్ చొరవతీసుకుని 2లక్షల50వేల రూపాయాల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసి పత్రాలను మంజూరీ చేయించి మంగళవారం రమణకు అందచేశారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఖాజాభాయ్, మధుసూదన్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

బైక్ రేసర్లు అరెస్టు.. 10 బైక్‌లు స్వాధీనం

రాయదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జ్‌సిటీలో రోడ్లపై బైక్‌రేస్‌లు నిర్వహిస్తున్న వారిపై రాయదుర్గం పోలీసులు రైడ్ చేసి పదిమందిపై కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి రాయదుర్గం నాలెడ్జ్‌సిటీ ప్రాంతంలోని టీహబ్, సత్వ ప్రాంతాల్లోని రహదారులపై బైక్‌రేసింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది రైడ్‌చేసి పది మంది రేసర్లను గుర్తించారు. మరో పదిమంది తప్పించుకుని పారిపోయారు. పది మంది గుర్తించి వారిలో నలుగురు పారిపోగా ఆరుగురిని మంగళవారం అదుపులోకి తీసుకుని పది బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. కొద్దివారాలుగా బైక్‌రేసర్లు శని, ఆదివారాల్లో బైక్ రైస్‌లు నిర్వహిస్తూ రోడ్డుపై వెళ్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం అందడంతో రాత్రి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి సమయంలో బైక్‌రేస్‌లు, విన్యాసాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ వారు రేసింగ్‌లు నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బైక్‌రేసర్లపై బైడోవర్ కేసులు నమోదు చేస్తున్నామని హెచ్చరించారు.

సమసిన హెచ్‌సీఏ విద్యుత్ వివాదం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పదేళ్లుగా టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌తో కొనసాగుతున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) విద్యుత్ బకాయిల వివాదానికి ఆ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు ముగింపు పలికారు. మంగళవారం టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీకి రూ.1 కోటీ 48 లక్షల 94 వేల చెక్‌ను అందించారు. 2015లో అక్రమంగా విద్యుత్‌ను వినియోగించారనే కేసులో టీఎస్ ఎస్‌పీడీసీఎల్‌కు సుమారు రూ.1 కోటీ 64 లక్షలు హెచ్‌సీఏ చెల్లించాల్సి ఉంది. అప్పటి నుంచి ఈ వ్యవహారం నానుతూ వస్తోంది. మేలో ఐపీఎల్ సందర్భంగా టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ అధికారులు ఉప్పల్ స్టేడియానికి విద్యుత్ నిలిపివేయడంతో ఈ వ్యవహారం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. దీంతో అప్పుడు తొలి వాయిదా కింద రూ.15 లక్షలు చెల్లించగా, మిగిలిన మొత్తాన్ని హెచ్‌సీఏ ఒకేసారి చెల్లించి, వివాదానికి ముగింపు పలికింది. స్టేడియానికి విద్యుత్ నిలిపివేసిన అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సీఎండీని జగన్ కోరారు.

చిన్నారుల కొనుగోలు కేసు

పూణెలో మరో ఐదుగురి అరెస్ట్

మరో ముగ్గురు చిన్నారులను రక్షించిన పోలీసులు


చిన్నారిని అధికారులకు అప్పగిస్తున్న సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంచలనం సృష్టించిన చిన్నారుల కొనుగోలు కేసులో రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మరో ముగ్గురు చిన్నారులను రక్షించినట్లు సీపీ తరుణ్ జోషి మంగళవారం తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అయి విక్రయించబడిన 15 మంది చిన్నారులను ఇటీవల రాచకొండ పోలీసులు రక్షించి, నిందితుల ముఠాను కటకటాల్లోకి నెట్టిన విషయం తెలిసిందే. రక్షించిన చిన్నారులను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇప్పటి వరకు మొత్తం రాచకొండ పోలీసులు రక్షించిన చిన్నారుల సంఖ్య 18కి చేరిందని సీపీ తెలిపారు. చిన్నారులను అక్రమ రవాణా చేయడంలో పూణె, ఢిల్లీ ముఠాల హస్తం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. పూణె పోలీసులు చిన్నారుల కొనుగోలు కేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిసింది. వీరికి నగరంలో దొరికిన ముఠాలతో లింకులపై రాచకొండ పోలీసులు ఆరా తీయగా.. ఐదుగురు నిందితులకు సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో వారిని పీటీ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చి విచారించి ఢిల్లీ ముఠాలతో ఉన్న లింకులపై సమాచారం రాబడతామని సీపీ తెలిపారు. త్వరలోనే ఢిల్లీ ముఠాలను గుర్తిస్తామన్నారు. ముఠాల గుట్టు వీడితే ఆ చిన్నారులను ఎక్కడ తెచ్చారు..? వారి తల్లి దండ్రులు ఎవరు..? అనేది తేలాల్సిన అవసరం ఉందని, అందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.

బదిలీలకు రంగం సిద్ధం

- కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిపై వేటు
- విభాగాల వారీగా అధికారులు, సిబ్బంది వివరాలు సేకరణ
- ఇప్పటికే జోనల్ కమిషనర్ బదిలీ.. త్వరలో మిగతా సిబ్బంది

కూకట్‌పల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. జోనల్ కార్యాలయంతో పాటు మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల కార్యాలయాల్లో పని చేస్తున్న ఉన్నతాధికారులు, అధికారులు, క్లర్క్స్, సిబ్బంది బదిలీలకు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు ప్రారంభించినట్లు తెలిసింది. ఇప్పటికే కార్యాలయాల వారీగా పని చేస్తున్న అధికారుల వివరాలు, ఎన్నేళ్లుగా ఒకేచోట పని చేస్తున్నారో.. అనే అంశాలపై నివేదిక తెప్పించుకొన్నారు. ఈ నేపథ్యంలోనే కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం, ఆయా సర్కిళ్ల కార్యాలయాల నుంచి ఇప్పటికే నివేదిక వెళ్లినట్లు తెలిసింది. ముఖ్యంగా మూడేళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న వారిని కచ్చితంగా బదిలీ చేసే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతేకుండా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుధ్యం, రెవెన్యూ విభాగాల్లో అవినీతికి పాల్పడుతున్న వారి వివరాలను కూడా ఉన్నతాధికారులు సేకరించినట్లు సమాచారం. ఇప్పటికే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ చేశారు. మిగతా అధికారులు, సిబ్బందికి త్వరలోనే స్థానచలనం కలిగే అవకాశం ఉంది.

అందినకాడికి దండుకొంటున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

కూకట్‌పల్లి జోన్ పరిధిలోని మూసాపేట, కూకట్‌పల్లి జంట సర్కిల్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు బదిలీల గుబులు పట్టుకొంది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయి విధులు నిర్వహిస్తూ ఉన్నారు. స్థానికంగా ఉన్న అక్రమ నిర్మాణదారుల నుంచి భారీగా వసూళ్లు చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తిన టీపీఎస్‌లు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగకమానదు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లకు ఒకే ఒక్క టీపీఎస్ అధికారి ఉండడంతో అతడు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. ప్రతీ పనిలో అందినకాడికి దండుకొంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నాడనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఐదేళ్లుగా ఇదే సర్కిల్‌లో టీపీఎస్‌గా పనిచేస్తున్న సదరు అధికారి త్వరలోనే బదిలీ కాబోతున్నారనే ఉద్దేశ్యంతో పది రోజులుగా సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణదారుల నుంచి భారీగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలోని టీపీఎస్ అధికారి, కోర్టు వివాదాలు చూసే క్లర్క్ స్థాయి సిబ్బంది అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.


మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం